క్లుప్తంగా

నలుగురు జూదరుల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని డైమండ్ పార్కు సమీపంలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రూ.9 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న హారికా ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బాలల్లో ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చని హర్షవల్లి లయన్స్‌క్లబ్ విద్యా సంక్షేమ చైర్మన్ హారికా ప్రసాద్, లయన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ అన్నారు. శ్రీకాకుళంలో ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం బాల్యంలో వచ్చే క్యాన్సర్- నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. క్యాన్సర్, ప్రాథమిక లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథంనాయుడు, ప్రధానోపాధ్యాయుడు టి.దేవదత్తానందం, మణిశర్మ, తరళి, తర్లాడ అప్పలనాయుడు, డైరెక్టర్లు పార్వతీశ్వరరావు, లక్ష్మీకాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగు లాభదాయకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శారద

జి.సిగడాం: రైతులు అపరాల పంట సాగు చేసుకుంటే లాభదాయకమని మండల వ్యవసాయాధికారి యర్రా శారద అన్నారు. మంగళవారం సంతవురిటిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వరి పొలంలో మొక్కజొన్నకే పరిమితం కాకుండా మినుము, పెసర వంటి అపరాల పంటలు వేసుకోవాలన్నారు. ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, మాజీ సర్పంచ్ పలిశెట్టి సూర్యనారాయణ, బాలబొమ్మ లోకేష్, శిర్రా గంగరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ అలుగోలు లక్ష్మినారాయణ, చందనాల రంగారావు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో షెడ్ ఏర్పాటు



షెడ్‌ను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

ఎచ్చెర్ల: లావేరు మండలం గుర్రాలపాలెం శ్మశానవాటికలో మంగళవారం రేకులషెడ్‌ను ప్రారంభించారు. అల్లంపల్లి రాంబాబు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గొల్లబాబు రజనీ దంపతులు, కుమార్తెలు విశాలాక్షి, సత్యవతి, జ్యోతి కలిసి ఈ షెడ్‌ను నిర్మించారు.

ఆస్పత్రి ప్రసవాలపై అవగాహన



సమీక్ష నిర్వహిస్తున్న గంగాప్రియదర్శిని

ఎచ్చెర్ల క్యాంపస్: గర్భిణులకు ఆస్పత్రి ప్రసవాలపై అవగాహన కల్పించాలని ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగాప్రియదర్శిని అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్య పరీక్షలు, పౌష్టికాహారం, మందుల వినియోగం, ఆస్పత్రుల్లో ప్రసవాలపై దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో వైద్యురాలు ఉషారాణి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ఎన్‌సీసీ బెటాలియన్‌తో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్ : స్వచ్ఛభారత్‌ను బాధ్యతగా స్వీకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ 14 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. చెత్తాచెదారాలు తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి యాల్ల పోలినాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, వావిలాపల్లి జగన్నాథనాయుడు, జోగినాయుడు, కొంక్యాన మురళి పాల్గొన్నారు.

రహదారులిలా.. రాకపోకలెలా?

- గోతులమయంగా రోడ్లు
- వాహనచోదకులకు తప్పని పాట్లు
- మాటలకే పరిమితమవుతున్న పాలకులు



అధ్వానంగా కొత్తపేట రోడ్డు

ఎచ్చెర్ల క్యాంపస్: సంక్రాంతి పండగకల్లా రహదారులను మెరిపిస్తామని చెప్పిన కూటమి పాలకుల మాటలు నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయి. ప్రధానంగా ఎచ్చెర్ల నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి దారుణంగా మారింది. ఏ రోడ్డు చూసినా భారీ గోతులే దర్శనమిస్తున్నాయి. నియోజకవర్గంలో 124 పంచాయతీలు, 100 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. చాలా వరకు రోడ్లు దెబ్బతిన్నాయి.

ఎచ్చెర్లలో..

ఎచ్చెర్ల మండలం తోటపాలెం కూడలి నుంచి ఎచ్చెర్ల వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారింది. ఇక్కడ ప్యాచ్ వర్క్‌లు చేసినా ఉపయోగం ఉండదు. పూర్తిస్థాయిలో కొత్తగా రోడ్డు వేస్తేనే ఫలితముంటుందని వాహనచోదకులు చెబుతున్నారు. భగీరథపురం నుంచి డి.మత్స్యలేశం వెళ్లే రోడ్డు, కొయ్యాం నుంచి బడివానిపేట వెళ్లే రోడ్డులో సైతం ఎక్కడికక్కడ గోతులే కనిపిస్తున్నాయి. కొత్తపేట, సెగిడిపేట, అంబేడ్కర్‌నగర్‌లను కలుపుతూ ఉన్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినా రోడ్డు నిర్మాణం ముందుకు సాగలేదు. జాతీయ రహదారి నుంచి ఎస్ఎంపురం వరకు వెళ్లే రోడ్డు ట్రిపుల్ ఐటీ వరకు మరమ్మతులు చేసి మిగతా రోడ్డు విడిచి పెట్టారు. కేశవరావుపేట నుంచి పిల్లలవలస, ధర్మపురం వైపు వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. అరిణాం అక్కివలస రోడ్డు, జరజాం రోడ్డు, కొంగరాం రోడ్డు, చిన్న కొంగరాం, ముద్దాడ, రామజోగిపేట వైపు వెళ్లే రోడ్డు, కుశాలపురం పంచాయతీ వెంకటాపురం రోడ్డులదీ ఇదే దుస్థితి. కుప్పిలి, అజ్జరాం, బుడగుట్లపాలెం రోడ్డు సైతం మరమ్మతులకు నోచుకోవడం లేదు.

రణస్థలంలో..

రణస్థలం మండలం జేఆర్ పురం నుంచి వెంకటరావుపేట వెళ్లే రోడ్డు కోష్ట నుంచి పల్లిపేట వరకు వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. మంజూరైన రోడ్డు పనుల్లో సైతం జాప్యం జరుగుతున్నాయి.

లావేరులో..

లావేరు మండలం అల్లినగరం నుంచి కేశవరాయునిపాలేంవరకు వెళ్లే రోడ్డు, అరిణాం అక్కివలస నుంచి బొంతివలస రోడ్డు దారుణంగా ఉంది. అదపాక నుంచి వెంకటాపురం రోడ్డు, నాగంపాలేం రోడ్డు, మురపాక నుంచి అజ్జరాం వెళ్లే రోడ్డు, కొత్తపేట నుంచి చిన్నయ్యపేట, కేశవరాయనిపాలెం నుంచి రాయిలింగాలవారిపేట, బెజ్జిపురం నుంచి బుడత వలస వెళ్లే వెళ్లే రోడ్లు గోతులుమయంగా మారాయి.

జి.సిగడాంలో..

జి.సిగడాం మండల కేంద్రం రోడ్డు, టీడీ వలస నుంచి నక్కపేట, విజయరామపురం రోడ్డు, సంతఉరిటి నుంచి సీతారంపురం వెళ్లే రోడ్డు, గెడ్డ కంచరాం నుంచి గదవపేట రోడ్డు, చంద్రయ్యపేట నుంచి గదవపాలెం రహదారులు శిథిలమయ్యాయి.



గోతులమయంగా కేశవరావుపేట రోడ్డు



ఎచ్చెర్ల నుంచి తోటపాలెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి

పనులు చేపట్టాలి..



రోడ్లు దారుణంగా మారాయి. తోటపాలెం నుంచి ధర్మవరం, ఎస్ఎస్ఆర్‌పురం, ఎచ్చెర్ల కలుపుతూ ఉన్న ఆర్‌అండ్‌బీ రింగు రోడ్డుకు మరమ్మతులు కోసం అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం . అయినా స్పందన లేదు. వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

– దుంప చిన్నారెడ్డి, ఎస్ఎస్ఆర్‌పురం

గోతులమయం..



రోడ్లు గోతులమయంగా మారాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కొత్తరోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి రోడ్డు నిర్మించాలి. కేశవరావుపేట నుంచి ఎస్ఎంపురం మీదుగా ధర్మపురం, పిల్లలవలస వెళ్లే రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

– కొత్తకోట సూర్యారావు, కేశవరావుపేట

నిధులు మంజూరు చేయాలి



మండలం యూనిట్‌గా బీటీ రోడ్లు పరిశీలించి నిధులు మంజూరు చేయాలి. వర్షాలకు చాలా వరకు పాడయ్యాయి. ఎచ్చెర్ల మండలంలో సమస్య మరింత తీవ్రతగా ఉంది. వాహన చోదకులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– అంబటి శ్రీనివాసరావు, సర్పంచ్, అరిణాం అక్కివలస

క్రీడలతో మానసికోల్లాసం

రణస్థలం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మంగళవారం జె.ఆర్.పురం హైస్కూల్లో 77వ అంతర పాఠశాలల జోనల్ గ్రిగ్స్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా బలమైన స్నేహ బంధాలు ఏర్పడతాయని చెప్పారు. క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.తిరుమల చైతన్య, ఎంఈఓ ఎ.త్రినాథరావు, హెచ్ఎం బి.రమణయ్య, పీఈటీ, పీడీ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ, గ్రిగ్స్, నీట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆర్.మాధవరావు, ఎస్.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఈశ్వరరావు

బీఆర్ఏయూ క్రికెట్ జట్టు ప్రకటన

ఎచ్చెర్ల క్యాంపస్: అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం కబడ్డీ జట్టును మంగళవారం వర్సిటీ అధికారులు ప్రకటించారు. కటిబోయిన గణేష్ (జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల, నరసన్నపేట), మక్కాల యోగానంద (శ్రీ కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం), మొదలవలస పూర్ణచంద్ర (హెచ్‌పీఎన్ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం), కొర్ను థామస్‌రామ్‌కుమార్ (జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల, నరసన్నపేట), యలుగు వరిషిత్ (సన్ డిగ్రీ కాలేజ్, శ్రీకాకుళం), బాడ ఆకాష్ (టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల) , గంగు అశ్వినీకుమార్ (తొగరాం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్), మీసాల నరేష్ (ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజ్, శ్రీకాకుళం), వరద గణేష్ (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజ్), పంగా కిశోర్‌కుమార్ (కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల , శ్రీకాకుళం), పొగిరి రేవంత్ కుమార్ (శ్రీకాకుళం పురుషుల డిగ్రీ కళాశాల), గంటా సాయికుమార్ (శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల), కల్లా రాజేష్ (జీసీఎస్ ఆర్ డిగ్రీ కాలేజ్, రాజాం), పుక్కళ్ల నీల్‌కుమార్ (ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల శ్రీ కాకుళం), కొనపాల సాయిభాస్కర్ (జీసీఎస్ఆర్ డిగ్రీ కలేజ్, రాజాం), వడ్డాది రాజశేఖర్ (శ్రీకాకుళం పురుషుల డిగ్రీ కళాశాల) ఎంపికయ్యారు. వీరంతా మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 16 నుంచి 24 వరకు జరిగే అంతర విశ్వవిద్యాలయం పోటీల్లో పాల్గొంటారు. క్రీడాకారులను స్పోర్ట్సు బోర్డు సెక్రటరీలు డాక్టర్ భాస్కర్ అనెకెం, డాక్టర్ ఎం.శ్రీనివాసరావులు అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో సెలెక్టర్లు, స్పోర్ట్సు బోర్డు ప్రతినిధులు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఎచ్చెర్ల: మొక్కజొన్న పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.త్రినాథస్వామి అన్నారు. మంగళవారం లావేరు మండలం గురుగుబిల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటల సాగుకన్నా తక్కువ పెట్టుబడితో ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న సాగు చేపడితే అధిక లాభాలు సాధించవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో మహేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రబీ పంట నమోదు తప్పనిసరి

రణస్థలం: రబీ సీజన్‌లో పంటలు వేసిన రైతులు విధిగా ఈ–క్రాప్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి తెలిపారు. కొండములగాంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం తొందరగా నూర్పు వేసుకొని కొనుగోలు కేంద్రాలు ద్వారా మిల్లుకు తరలించాలన్నారు. అనంతరం మొక్కజొన్నలో చీడ పీడలు, సమగ్ర ఎరువులు యాజమాన్యం పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి

మస్టర్ల నిర్వహణలో పొరపాట్లు

గార: ఉపాధి హామీ పథకం పనులపై ఇప్పటి వరకు జరిగిన తనిఖీల్లో మస్టర్ల నిర్వహణలో పొరపాట్లు గుర్తించామని ఎస్ఆర్‌పీ ఇ.పున్నంనాయుడు అన్నారు. మంగళవారం అంపోలు, శ్రీకూర్మం, వత్సవలస, బలరాంపురం పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై ఇప్పటికే 10 పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందాల సభ్యులు కొలతలు, మస్టర్లు గమనించారని చెప్పారు. ఈ నెల 18న జరిగే ప్రజావేదికలో మండల నివేదికను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ గొండు జయరాం, గోరు అనిత, అంధవరపు బాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకూర్మంలో గ్రామసభ నిర్వహణ

11న పూర్వ విద్యార్థుల సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈ నెల 11న పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 23, 24 తేదీల్లో నాక్ పీయర్ టీం సందర్శించనుంది. కళాశాల అభివృద్ధి, ప్రమాణాలు, పరిసరాలు, ఫలితాలు, ప్రగతి, పనితీరు, కార్యక్రమాల నిర్వహణ, పూర్వ విద్యార్థుల ఫీడ్‌బ్యాక్ తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకుని గ్రేడ్ కేటాయింపు జరగనుంది. ఈ నేపథ్యంలో కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సమావేశంలో అధ్యక్షుడు డాక్టర్ అంబటి రంగారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కళాశాల ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులంతా శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కళాశాల సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియంలో జరిగే సమావేశానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చెడు వ్యసనాలతో జీవితం నాశనం



అవగాహన కల్పిస్తున్న సీఐ పి.ఈశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు చెడు వ్యసనాల జోలికి పోకుండా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు అన్నారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం చేపలవీధి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో సంకల్పం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, గుట్కా వంటి చెడు అలవాట్లకు బానిస కావద్దని హితవు పలికారు. తల్లిదండ్రుల కలలు నిజం చేస్తూ ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీసులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరంలో గంగిరెద్దుల సందడి



గంగిరెద్దును పూజిస్తున్న మహిళ

శ్రీకాకుళం కల్చరల్: సంక్రాంతి సమీపిస్తుండటంతో నగరంలో గంగిరెద్దుల సందడి నెలకొంది. దూదూబసవన్నలు ఇంటింటికీ వెళ్లి ప్రదర్శన చేస్తూ ఆశీర్వచనాలు అందిస్తున్నారు. ఇంటివద్దకు వచ్చే గంగిరెద్దుకు పసుపు రాసి బొట్టు పెట్టి నమస్కారాలు చేస్తున్నారు.

ఉత్సాహంగా క్యాంప్‌ఫైర్



చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, మండల విద్యాశాఖ అధికారులకు శిక్షణ ఇస్తున్నారు. ఆరు రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణలో ఐదో రోజు మంగళవారం రాత్రి క్యాంప్ ఫైర్ నిర్వహించారు. ఉపాధ్యాయులంతా ఉత్సాహంగా పాల్గొని కోలాటం, నృత్యాలు చేశారు. డీఈవో తిరుమల చైతన్య, రిసోర్సు పర్సన్లు హాజరయ్యారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

శ్రీఆంజనేయం



గుజరాతిపేటలోని జగన్నాథస్వామి ఆలయంలో కొలువైన శక్తిపథ ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

కరుణించమ్మా.. భద్రమ్మా..



జిల్లా కేంద్రంలోని బలగ భద్రమ్మతల్లి దేవాలయంలో పుష్యమాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి భక్తులు ముగ్రాట్లు సమర్పించారు.

– శ్రీకాకుళం కల్చరల్

చెత్తమయం



కళింగపట్నం పంచాయతీ మిరియం చెరువు వద్ద అయ్యప్ప దేవాలయానికి వెళ్లే దారిలో చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను అక్కడే మంటపెట్టి కాల్చుతుండటంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది దృష్టిసారించి చెత్త తొలగించాలని పలువురు కోరుతున్నారు. – గార

ఉద్యోగ, కార్మిక సంఘాల వాగ్వాదం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ఎఫ్–1 గుమస్తా ధనుంజయ, కంప్యూటర్ ఆపరేటర్ మనోజ్‌ల తీరుపై పారిశుద్ధ్య కార్మికుల ఏఐటీయూసీ యూనియన్ నాయకులు తిరుపతిరావు, కల్యాణి అప్పలరాజు మంగళవారం మండిపడ్డారు. పారిశుద్ధ్య కార్మికుల ఇన్‌స్పెక్టర్లకు సంబంధించి మూడు నెలల జీతాలు పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసే తమలాంటి వారిపై ఎందుకంత కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని నిలదీశారు. ఈ క్రమంలో తమను తిట్టారంటూ ఉద్యోగులు తిరగబడ్డారు. దీంతో ఈ పంచాయితీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఇరువురిని రాజీచేసే ప్రయత్నం చేశారు. వారు వినకపోవడంతో హెల్త్ ఆఫీసర్ వద్ద తేల్చుకోవాలని సూచించారు. ఎంహెచ్ఓ ఇరువర్గాలను కూర్చోబెట్టి జీతాలు పెట్టించే బాధ్యత తనదని భరోసా ఇవ్వడంతో వెనుదిరిగారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు

సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటం అవసరం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విశాఖపట్నం చెందిన ఎస్.శ్రీనివాసరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులపై ఉందని పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రరెడ్డి కోరారు. మంగళవారం శ్రీకాకుళంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రైవేట్ యాజమాన్యాలు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు యాజమాన్య పాఠశాలలంతా సంఘటితంగా ముందుకు సాగితేనే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. సమావేశంలో అపుస్మా రాష్ట్ర అధ్యక్షులు తులసి విష్ణుప్రసాద్, చీఫ్ మెంటర్ కృష్ణారెడ్డి, బి.లక్ష్మణరావు, మోహన్‌రెడ్డి, అప్పలాచార్యులు, పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రరెడ్డి

అక్రమంగా సీనరేజ్ సెస్ వసూలు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం, పొందూరు రోడ్డులో ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు అక్రమంగా సీనరేజ్ సెస్ వసూలు చేస్తున్నారని చిలకపాలెం క్వారీ లారీ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఆందోళనకు దిగారు. చిలకపాలెం, పరిసర గ్రామాలకు చెందిన తాము 50 ఏళ్లగా లారీ, ట్రాక్టర్లు నడుపుతూ జీవిస్తున్నామని, ఎప్పుడూ లేని విధంగా సీనరేజ్ సెస్ వసూలు చేస్తున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. 40, 20, 10 ఎంఎం పిక్క అమ్ముతున్నామని, రవాణా సమయంలో రశీదులు సైతం ఇవ్వకుండా వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి చట్టపరంగా నిబంధనలు అమలు చేయాలని కోరారు.



ఆందోళన చేస్తున్న క్వారీ అసోసియేషన్ సభ్యులు

ప్రధాని సభకు ఆర్టీసీ బస్సులు

ఎచ్చెర్ల క్యాంపస్: విశాఖపట్నంలో బుధవారం నిర్వహించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమావేశానికి ప్రజల తరలింపునకు 31 ఆర్టీసీ బస్సులు ఎచ్చెర్ల మండలానికి కేటాయించారు. ఈ మేరకు తహశీల్దార్ సింహాచలం, మండల పరిషత్ పరిపాలన అధికారి పీవీఎస్ రామ్మోహన్‌తో కూడిన అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. ఎచ్చెర్ల మండలం నుంచి బస్సుకు 50 మంది చొప్పున 1550 మందిని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.